క్లుప్తంగా

'ఉపాధి హామీ' అవకతవకలపై ఫిర్యాదు

చర్ల: మండలంలోని గొంపల్లిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరగాయని, వాటిపై విచారణ జరిపించాలని కోరుతూ గొంపల్లికి చెందిన ఉపాధి హామీ కూలీలు సోమవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ క్యాదర్శి కొండా చరణ్, మండల కార్యదర్శి కొండా కౌశిక్‌ల ఆధ్వర్యంలో కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి పనులు చేయని వారి పేర్లపై మస్టర్లు వేసి, పనులు చేసిన వారికి మస్టర్లు వేయకపోవడంతో పని చేసిన కూలీల ఖాతాలలో డబ్బులు పడలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని, తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కూలీలు కోరారు.

పుస్తకాలొచ్చాయ్..

దుమ్ముగూడెం: మండలంలోని 103 పాఠశాలలకు కావాల్సిన 14596 పుస్తకాలకు గాను మండల విద్యావనరుల కార్యాయానికి 14037 పుస్తకాలు చేరడంతో వాటిని అధికారులు ఉపాధ్యాయులకు పంపిణీ ప్రారంభించారు. పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు 8578 సైతం మండలానికి చేరుకున్నాయి. మండలంలో మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన ప్రాథమిక పాఠశాలలన్నీ కలిపి 103 ఉన్నాయి. వాటిలో 3500 మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందచేసే ఏకరూప దుస్తులు ఒక్కో విద్యార్థికి ఒక్కో జత చొప్పున ప్రస్తుతానికి మండల కార్యాలయానికి చేరుకున్నాయి.

జీసీసీ హమాలీల నిరసన

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థలో పనిచేస్తున్న హమాలీలు, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రమును, దమ్మపేట జీసీసీ మేనేజర్ సుగ్గల నరసింహారావుకు అందజేసి, పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా హమాలీ నాయకులు మాట్లాడుతూ.. జీసీసీలో పనిచేస్తున్న కార్మికులను నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎగుమతి, దిగుమతి రేట్లను పెంచి, ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికులకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. దసరా పండుగ బోనస్‌ను పెంచి, కార్మికులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

మణుగూరుటౌన్: ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు సంబంధించి చర్యలు చేపట్టాలని కోరుతూ సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఈపీ ఆపరేటర్ల ఆధ్వర్యంలో సోమవారం ఇన్‌చార్జ్ ఎస్‌ఓటూ జీఎం వెంగళరావుకు ఆపరేటర్ల సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు నాజర్‌పాషా మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ గడువు ముగిసినందున ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు సంబంధించి ఇప్పటికే అర్హత పరీక్ష నిర్వహించి ఉన్న ఏ–గ్రేడ్, బీ–గ్రేడ్ ప్రమోషన్ల ఆర్డర్ కాపీలు బ్యాక్ డేట్‌తో కలిపి వెంటనే ఆపరేటర్లకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నరేశ్, సతీష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరభద్ర స్వామి బోనాలు



తాలిపేరు నది నుంచి గంగా జలాన్ని తీసుకొస్తున్న భక్తులు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో సోమవారం పానగంటి వారి ఇలవేల్పు అయిన వీరభద్ర స్వామి వారి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ రెండేళ్లకోసారి పానగంటి కుటుంబీకులు నిర్వహించే ఈ వేడుకలో భాగంగా ముందుగా తాలిపేరు నదికి చేరుకున్న భక్తులు అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాలిపేరు నది నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంలో భక్తులు పూనకాలతో ఊగిపోయారు. ఉపావాససాలు ఉన్న భక్తులు వీరతాడు, త్రిశూలాలను తీసుకొచ్చి సాంప్రదాయబద్ధంగా మట్టిపాత్రలో భద్రపరచారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి పానగంటి ఇంటి పేరు గల కుటుంబాలు తరలివచ్చారు.

జీసీసీ సేల్స్‌మెన్ మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన జీసీసీ సేల్స్‌మెన్ కోండ్రు శ్రీనివాసరావు(42) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. శ్రీనివాసరావు మృతదేహానికి మాజీ సర్పంచ్ మడకం సాధు, మాజీ ఉపసర్పంచ్ అంకుషఅలీ, మాజీ ఎంపీటీసీ బొర్రా శ్రీను, స్థానికులు నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఖరీఫ్‌కు రైతులు సిద్ధం

- సాగుకు అనువుగా అడపాదడపా వర్షాలు
- వరి నారుమళ్లు, పత్తి నాటేందుకు సమాయత్తం
- తగ్గనున్న మిర్చి, పెరగనున్న వరి సాగు విస్తీర్ణం



గతంలో మిర్చి సాగు చేసి ఇప్పుడు వరి పంటకు సిద్ధం చేసిన పొలం

చర్ల: ఖరీఫ్ పనులను రైతులు సంసిద్ధులవుతున్నారు. గత 15 రోజుల నుంచి అడపా దడపా కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలంగా మారుతుండడంతో రైతులు పంట పొలాలను సిద్ధం చేయడంలో బిజీ అయ్యారు. వరి పంట సాగు చేసే రైతులు వరినార్లు పోసేందుకు నారుమళ్లను సిద్ధం చేస్తుండగా, పత్తి సాగు చేసే రైతులు పంట చేలను విత్తనాలు నాటేందుకు అనువుగా చేస్తున్నారు. ఇటీవల రెండు వారాల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలు సాగు పనులకు అనుకూలంగా మారడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో బిజీబిజీ అయ్యారు. ఈ వారం పది రోజుల్లో వరినార్లు పోస్తే ఆ తరువాత అడపాదడపా కురిసే వర్షాలకు వరినార్లు ఏపుగా ఎదిగి జూలై మొదటి వారంలో నాటేందుకు సిద్ధమవ్వనుండడంతో రైతులు వరినార్లు పోయాలనేది రైతుల ప్రణాళిక. ఈ క్రమంలో కొందరు రైతులు ఈపాటికే వరినార్లు పోయగా, మరి కొందరు వరినారు మళ్లను సిద్ధం చేస్తున్నారు.

వరికే మొగ్గు..

అధిక ధర రావడంతో రైతులు రెండేళ్లుగా వరి పంటలు వేసే భూములను కూడా మిర్చి సాగుకు అనుకూలంగా తయారు చేసి మిర్చి పంటలు సాగు చేశారు. కానీ ఆపై ధరలు ఆశించిన మేర రాలేదు. గత రెండేళ్ల క్రింత మిర్చికి క్వింటాకు రూ.23 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలుకగా అటు తరువాత క్రమేపీ తగ్గుతూ వచ్చింది. ఫలితంగా రైతులు ఈ ఏడాది పండించిన మిర్చి పంటను ఎక్కువ శాతం ఏసీ గోడౌన్‌లలో నిల్వ ఉంచడంతో వచ్చే ఏడు మిర్చి ధర తగ్గువచ్చునన్న అనుమానాలు రైతుల్లో ఉన్నాయి. దీంతో మిర్చి సాగుకు పెద్దగా ముందుకు రావడం లేదు. పైగా మిర్చి చేలకు అధిక కౌలు ఉండడం రైతులను మరింత నిరుత్సాహానికి గురి చేస్తోంది. దీనికితోడు ఈ సంవత్సరం నుంచి వరి పంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో రైతులు ఈ సారి వరికే మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది చర్ల మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి పంటలు సాగవ్వగా, 4500 ఎకరాల్లో మిర్చి పంటలు సాగు చేశారు. అయితే ఈ సారి మాత్రం సుమారు వెయ్యి నుంచి 1500 ఎకరాల మేర మిర్చి సాగు తగ్గి, 17 వేల నుంచి 18 వేలకు వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పత్తిమోట్లు రెడీ..

ఇదే సందర్భంలో వర్షాధారం కింద పత్తి పంటలు సాగు చేసే రైతులు కూడా ఈపాటికే పత్తిమోట్లు తీయడం, దుక్కులు చేయడం పూర్తి చేశారు. పలుమార్లు దుక్కి చేసిన రైతులు విత్తనాలు నాటేందుకు అనువుగా పత్తి చేలను సిద్ధం చేయగా, ఏదైనా బట్టి వర్షం కురిసిన వెంటనే విత్తనాలు నాటనున్నారు.

గిరిజనులు పత్తిసాగుకే పట్టం

చర్ల మండలంలో గత ఏడాది సుమారు 4700 ఎకరాల్లో పత్తి పంటలు సాగు చేశారు. ఈ ఏడాది ఆ సంఖ్య 5700 ఎకరాలకు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం గిరిజన గ్రామాల్లో పత్తిసాగు విస్తీర్ణం పెరిగడమే. పూర్తి స్థాయిలో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడంతో గిరిజన రైతులు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. నిరుపయోగంగా ఉన్న భూములను సాగులోకి తీసుకొస్తున్నారు. తద్వారా గతంలో కంటే మరో వెయ్యి ఎకరాల్లో గిరిజన గ్రామాల్లో పల్లి సాగు పెరిగే అవకాశాలున్నాయి.

మిర్చి సాగు తగ్గిస్తున్నాం..



మిర్చి ధరలు గతంలో క్వింటా రూ.25 వేల వరకు పలికిన మిర్చి.. రూ.15 నుంచి రూ.16 వేల వరకు పడిపోయింది. కౌలు, సాగు ఖర్చులు కూడా పెరగడంతో మిర్చి పంటలు సాగు చేయడం కష్టంగా మారుతోంది. దీంతో మిర్చి పంట సాగు తగ్గించి వరి పంట వేయాలనుకుంటున్నాం.

– టి.నర్సింహారావు, రైతు, చర్ల

పెరగనున్న వరి, పత్తి సాగు



చర్ల మండలంలో వరి సాగు స్వల్పంగా పెరుగనుంది. మిర్చికి ధరలు క్రమేపి తగ్గుతుండడం, సాగుభూమి కౌలు ధరలు పైపైకి పెరుగుతుండడం, మిర్చి పంటలకు నిత్యం తెగుళ్లు ఆశిస్తుండడంతో రైతులు మిర్చి పంటల సాగు తగ్గించనున్నారు. వరి, పత్తి వైపు మొగ్గు చూపనున్నారు.

– పి.శివరాంప్రసాద్, ఏఓ, చర్ల

నకిలీలపై అప్రమత్తంగా ఉండాలి



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారి తాతారావు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ సీజన్ నేపథ్యంలో నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విత్తనాల విక్రయాల్లో కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అంతర్గత తనిఖీ అధికారి, మణుగురు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు తాతారావు అన్నారు. సోమవారం స్థానిక రైతు వేదికలో మండలంలోని విత్తనాల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణాల్లో తప్పనిసరిగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేసి వాటిలో నిల్వల వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. అనంతరం స్థానిక విత్తనాల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేసి, స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయించారు. అలాగే దుకాణాల్లో విక్రయాలకు సంబంధించిన బిల్లులు, రసీదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ నవీన్, ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఇంటింటి సర్వే

సాక్షి ఎఫెక్ట్..

చర్లరూరల్: మండలంలోని చర్ల, కొయ్యూరు, చర్ల ప్రభుత్వ వైద్యశాలల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. 'ఏజెన్సీని వెంటాడుతున్న జ్వరాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా వైద్యాధికారులు తక్షణమే ఇంటింటి సర్వేను చేపట్టి జ్వరపీడితులను గుర్తించాలని, జ్వరాల వ్యాప్తికి గల కారణాలను తెలుసుకోవాలని ఆదేశించారు. దీంతో చర్ల మండలంలో ఇంటింటి సర్వేను చేపట్టారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. దోమల వ్యాప్తికి గల కారణాలపై ఆరా తీశారు. ఇళ్లలో ఉండే వాటర్ కూలర్లు, నీళ్ల డమ్ములు, ఖాళీగా ఉండే టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలలో దోమలు పెరుగుతున్న విషయాలను గుర్తించారు. దోమలు పెరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.



చర్లలో దోమలు వ్యాప్తి చెందడానికి గల కారణాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

అదుపుతప్పి లారీ బోల్తా

అశ్వారావుపేటరూరల్: ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. అశ్వారావుపేటలోని శ్రీ లక్ష్మి తులసీ అగ్రో పేపర్ ఫ్యాక్టరీలో సోమవారం పేపర్ రీల్స్‌ను లారీలో లోడ్ చేసుకున్నాక డ్రైవర్ ఫ్యాక్టరీ సమీపంలోని బంక్‌కు వెళ్లాడు.

డీజిల్ పోయించుకున్నాక బయటకు వస్తున్న క్రమంలో అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలోని డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: ఆపదలో ఉన్న వారికి చేస్తున్న లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రాత్రి మణుగూరు పట్టణంలోని స్నేహాగార్డెన్స్‌లో జరిగిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ప్రెసిడెంట్ గాజుల పూర్ణ చందర్ అధ్యక్షతన జరగ్గా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. పర్యావరణ, విద్య వైద్యం విషయంలో లయన్స్ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా 30వ ప్రెసిడెంట్‌గా నల్లగట్ల సత్యప్రకాశ్, సెక్రటరీగా షేక్ మీరా హుస్సేన్, ట్రెజరర్‌గా ఎం.శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించి ఈ ఏడాది కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అవార్డులు అందుకున్న లయన్స్‌క్లబ్‌ను, చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారి శెట్టి హరిబాబును అభినందించారు. అడబాల నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు, గబ్బేట రాజయ్య, కృష్ణమోహన్, భుక్య ప్రసాద్, కాప మురళి, వెంకటపుల్లయ్య, గాజుల కోటేశ్వరరావు, లక్ష్మణరావు, రమేశ్, దండ రాధాకృష్ణ, దుగ్గి సతీష్, కముజు చంద్రమోహన్, బేతంచర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ ఇన్‌చార్జ్ డీటీగా శ్రీరామ్

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ సివిల్ సప్లయీస్ ఇన్‌చార్జ్ డీటీగా భూక్యా శ్రీరామ్‌ను నియమిస్తూ పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డీటీగా విధులు నిర్వహించిన వెంకటేశ్వరరావు రిటైర్డ్ కావడంతో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

చంద్రుగొండ: దేశప్రధానిగా మోదీ మూడో సారి పగ్గాలు చేపట్టడంపై బీజేపీ శ్రేణులు మండలంలోని వెంకటియాతండాలో సోమవారం సంబురాలు చేసుకున్నారు. మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుగులోతు శ్రీను, మోహన్‌నాయక్, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌నాయక్, చందర్ పాల్గొన్నారు.

పాలు, పండ్లు పంపిణీ

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, శివకామేశ్వరిగ్రూప్స్, దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఆరీఫా–రోష్ని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

విత్తనాలు అందించాలి

దుమ్ముగూడెం: మండలంలోని రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలని, రెండు లక్షల రుణమాఫీ చేయాలని ప్రగతిశీల రైతు సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సున్న వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కార్యక్రమంలో ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి సాయన్న,మండల నాయకులు రామ్ శెట్టి, కుంజ కన్నయ్య, పునీసు లక్ష్మి, కారం శీను, ముదిరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం అధ్యక్షుడికి పరామర్శ

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు కూరపాటి శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం దశదిన కర్మ కార్యక్రమానికి డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మంత్రి సీతక్క కుమారుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు ధనసరి సూర్య, ఎంపీపీ ముత్తినేని సుజాత హాజరై సావిత్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కూరపాటి శ్రీనివాసరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో భారజల కర్మాగారం ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, పలు పార్టీలు, సంఘాల నాయకులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: నూతన చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సోమవారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో చేపట్టిన 'వర్క్‌షాప్ ఆన్ న్యూ క్రిమినల్ లాస్'ము గింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాట్లాడుతూ.. జూలై 1 నుంచి కేంద్ర ప్రభుత్వం 'నూతన నేర, న్యాయ చట్టాలు–2023'అమలులోకి తేనున్న నేపథ్యంలో కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన విధానాలపై అవగాహన ఉండాలన్నారు. అప్పుడే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి తదితర అంశాలు తెలుస్తాయన్నారు. అనంతరం గడిచిన మూడు రోజులుగా శిక్షణ తీసుకున్న వారిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీసులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐలు నాగరాజు రెడ్డి, భద్రాచలం సీఐ సంజీవరావు, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం ఎస్ఐలు కేశవ్, నర్సిరెడ్డి, పీవీఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికుల సమ్మె



ఏరియా ఆస్పత్రి ఆవరణ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ.. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. సోమవారం ఉదయం నుంచి ఆస్పత్రిలో శానిటేషన్ పనులు నిలిపివేయడంతో ఎక్కడికక్కడ శానిటేషన్ పనులు స్తంభించిపోయాయి. సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల 7వ తేదీ లోపు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని జీవోలో ఉన్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, పీఎఫ్ ఈఎస్ఐలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు కార్మికులకు తెలియ చెప్పాల్సి ఉన్నప్పటికీ అలా చేయడం లేదని అన్నారు. కార్మికులకు రూ.15 వేల 600 లు ఇవ్వాలని జీవోలో ఉన్నప్పటికీ కేవలం రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. సమ్మెతో శానిటేషన్ పనులు స్తంభించడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ స్పందించారు. ఆయన చొరవతో ఐటీడీఏ పీఓ ఒక నెల వేతనం తక్షణమే మంజూరు చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు సమ్మె శిబిరాన్ని సందర్శించి మిగతా పెండింగ్ వేతనాలు పది రోజుల్లో చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర సమస్యలపై చర్చిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విరమించారు. జరిగింది. ఇచ్చిన హామీలను 10 రోజులలో అమలు చేయకుంటే తిరిగి సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు, కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీఐటీయూ నాయకులు బండారు శరత్ బాబు, పి.సంతోష్ కుమార్, జి.లక్ష్మీకాంత్, భూపేంద్ర, రమాదేవి, కృష్ణ భవాని, సుల్తానా, శ్రీకాంత్, పెద్ద రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు శిక్షణ

ములకలపల్లి: రైతునేస్తం కార్యక్రమంలో బాగంగా నేడు రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి (ఎంఏఓ) కరుణామయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి విత్తనాల రకాల ఎంపిక, సేంద్రియ వ్యవసాయం, పత్తిలో అధిక సాంద్రత పద్ధతి తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు. ములకలపల్లిలోని రైతువేదికకు ఉదయం పది గంటలకు రైతులు హాజరుకావాలని సూచించారు.

ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం



సమ్మర్ ఫుట్‌బాల్ ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులు, ముఖ్య అతిథులు..

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో భద్రాచలం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి ప్రారంభమైన సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్ సోమవారంతో ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు భద్రాచలం పట్టణ ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ బొల్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు తెలిపారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులో 100 మంది పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు, శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ నిర్వహించి గెలిచిన విన్నర్స్, రన్నర్స్‌కి బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు కోచ్‌లు విక్రమ్, రవి, చందు, పవన్, రాము, సాగర్ పాల్గొన్నారు.

మొరం నిల్వలు సీజ్

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: ములకలపల్లి మండలపరిధిలోని సంక్రకుంట శివారులో బీటీ రోడ్డు సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన మొరం (గ్రావెల్) కుప్పలను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. మూకమామిడి ప్రాజెక్ట్ శివారు నుంచి ట్రాక్టర్లలో మొరం తీసుకొచ్చి, రోడ్డుపక్కనే డంపింగ్ చేసి లారీల్లో బయటకు తరలిస్తున్న ఉదంతంపై 'మొరం.. మాయం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన ములకలపల్లి రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) రవికిరణ్ విచారణకు ఆదేశించారు. డీఆర్ఓ రాము, ఎఫ్‌బీఓ కవిత క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలు సేకరించారు. మొరం నిల్వలను సీజ్ చేశామని, విచారణ చేపడుతున్నామని ఎఫ్ఆర్ఓ 'సాక్షి'కి తెలిపారు.

వృద్ధాశ్రమాల్లో ఎంపీపీ అన్నదానం

అశ్వాపురం: మండల కాంగ్రెస్ నాయకుడు ముత్తినేని శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలోని ఆరీఫా–రోష్ని, సీతారాంపురం గ్రామంలోని మానవీయ, మణుగూరులో అమ్మ–నాన్న వృద్ధాశ్రమాల్లో సోమవారం ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం, మసీదు, చర్చీలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని జరిగిన ముత్తినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి.షర్ఫియుద్దిన్, ఎస్‌కె.ఖధీర్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



మణుగూరురూరల్: పిల్లల వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

మణుగూరురూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, కూనవరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మీరాహుస్సేన్ కోరారు. సోమవారం మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలోని ఎన్‌టీఆర్ నగర్‌లో ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ.. ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మీరాహుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. 5 సంవత్సరాల పైబడిన పిల్లలను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, ఆరో తరగతి తర్వాత జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారయ్య, కె.రామ్మోహన్‌రావు, సింగా రవిబాబు, రేగా జయలక్ష్మి, బి.ఈరు, అంగన్‌వాడీ టీచర్స్ జె.రాజేశ్వరి, లీలావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాటలో భాగంగా సోమవారం దుమ్ముగూడెం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌యం రామారావు ఆధ్వర్యంలో బైరాగులపాడు, శ్రీనగర్ కాలనీ గ్రామాల్లో డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే అనేక కార్యక్రమాలను కరపత్రాల్లో ముద్రించి ప్రతి ఇంటింటికీ పంచారు. గ్రామంలో బడి ఈడు గల పిల్లలందరినీ బడికి పంపాలని బడికి పంపడం వలన వారికి వచ్చే లాభాలను వివరించి తల్లిదండ్రులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.